ప్రజాశక్తి

మంగళవారం 30 జులై 2024 | 5 | విజయనగరం



1న జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరంకోట

వివిధ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీ కోసం ఆగస్టు ఒకటో తేదిన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. అమర్ రాజా బ్యాటరీస్‌లో మిషన్ ఆపరేటర్ (250), అప్రంటీస్ ట్రెయినీ (250), ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకులో బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్స్ (60) ఉద్యోగాల భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. ఆయా పోస్టులను బట్టి ఐటిఐ, ఇంటర్, డిగ్రీ, ఉత్తీర్ణులైనవారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారు చిత్తూరు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పేర్లను ముందుగా ఎంప్లాయిమెంట్.ఏపి.జిఒవి.ఇన్.. వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, ఆగస్టు ఒకటో తేదిన ఉదయం 10 గంటలకు విజయనగరంలోని బిసి కాలనీలో ఎన్న ప్రభుత్వ ఐటిఐలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. ఇతర వివరాల కోసం 8919179415 నంబరును సంప్రదించాలని సూచించారు.

విజయనగరం, శృంగవరపుకోటలో ధర్నాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు, సహారా ఖాతాదారులు, ఏజెంట్లు

డిపాజిట్లు చెల్లించాల్సిందే

సహారా బాధితుల పోరాట కమిటీ ఆధ్వర్యాన ఆందోళనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఖాతాదారులకు, ఏజెంట్లకు డిపాజిట్ డబ్బులు చెల్లించి న్యాయం చేయాలని సహారా ఇండియా బాధితుల పోరాట కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు విజయనగరం, శృంగవరపుకోట, బొబ్బిలిలో ఆ కమిటీ ఆధ్వర్యాన బాధితులు సోమవారం ఆందోళనలు చేపట్టారు. విజయనగరంలోని ఆర్అండ్‌బి జంక్షన్ వద్ద ధర్నా చేశారు. అనంతరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు బి.రమణ, ఎస్.వెంకటరమణ మాట్లాడుతూ 12 ఏళ్ల నుంచి సహారా బాధితులకు పేమెంట్లు చేయకుండా మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. డబ్బులు ఇవ్వకుండా సాకులు చెబుతూ బాండ్ల కాలపరిమితి పొడిగిస్తూ, మారుస్తూ వస్తున్నారని మండిపడ్డారు. ఈ సంస్థలో పేదలు, మధ్యతరగతి ప్రజలు పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం దాచుకున్న డబ్బును ఇవ్వకుండా మోసం చేయడం దారుణమన్నారు. ఈ విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా న్యాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు ఎస్.ఎం.నాయుడు, కె.వాసుదేవరావు, కె.మోహనరావు, పి.సాయికృష్ణ, కె.ఎ.ప్రసాద్, కంది త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : సహారా ఖాతాదారులు దాడుచుకున్న డబ్బులు వెంటనే చెల్లించాలని పోరాట కమిటీ ఆధ్వర్యాన శృంగవరపుకోట పట్టణంలోని దేవి కూడలిలో మానవహారం చేపట్టారు. తొలుత ఆర్‌టిసి కాంప్లెక్సు నుంచి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ భరత్‌కు, ఎస్ఐ గంగరాజుకు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు చల్లా జగన్ మాట్లాడుతూ డిపాజిట్ చేసిన మొత్తానికి కాలపరిమితి ఎప్పుడో దాటినా, ఇప్పటికీ చెల్లింపులు చేయకపోవడం అన్యాయమన్నారు. రాజకీయ, ఆధిపత్య కారణాల వల్ల డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. శృంగవరపుకోటలోని సహారా బ్రాంచ్ మూసేయడంతో తమ సమస్య ఎవరికి చెప్పుకోవాలని ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారని, వెంటన బ్రాంచ్ తెరవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితులకు డబ్బులు చెల్లించేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.అప్పారావు, పోరాట కమిటీ నాయకులు మద్దెల రమణ, ముత్యాలు, షేక్ ఖాన్, అప్పలరాం, తాతారావు, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : సహారా బాధితులకు న్యాయం చేయాలని సహారా ఇండియా బాధితుల పోరాట కమిటీ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మీదాస్, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సహారా బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ పట్టణంలోని ఎన్‌టిఆర్ విగ్రహం జంక్షన్‌లో మానవహారం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సహారా బాధితులకు అన్యాయం చేసిన యాజమాన్యానికి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కొమ్ము కాయడం దారుణమని విమర్శించారు. సహారా బాధితులకు డిపాజిట్ సొమ్ము వడ్డీతో సహా పూర్తి స్థాయిలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్పందించి సహారా బాధితులకు న్యాయం జరిగేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, పోరాట కమిటీ నాయకులు సురేష్, బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో మానవహారం చేపడుతున్న పోరాట కమిటీ నాయకులు, సహారా ఖాతాదారులు, ఏజెంట్లు

గుర్తింపు ఉందా? లేదా?

జిల్లాలోని క్రీడా సంఘాలపై మంత్రి శ్రీనివాస్ ఆరా ● ఐదేళ్లుగా క్రీడాకారులకు దొరకని భరోసా

క్రీడా సంఘాలు.. క్రీడాభివృద్ధికి, ఉత్తమ క్రీడాకారులను తయారు చేసేందుకు ఏర్పడ్డాయి. ఓ క్రీడా సంఘం ఏర్పడిందంటే ఆ సంఘం ఏ లక్ష్యంతో ఏర్పాటు చేసిందో అందుకు అనుగుణంగా పని చేయాలి. నేడు విజయనగరం జిల్లాలో ఒకే క్రీడకు రెండు నుంచి మూడు, నాలుగు సంఘాలు ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. క్రీడాకారులను తయారు చేసి, రాష్ట్ర, జాతీయ పోటీలకు పంపించి క్రీడల అభివృద్ధికి దోహద పడాల్సిన క్రీడా సంఘాలు.. నేడు ఆ దిశగా పనిచేయడంలో విఫలమవుతున్నాయా? అంటే అవుననే సమాధానం వస్తోంది. ఏ క్రీడా సంఘం గుర్తింపు పొందిందో, ఏ అసోసియేషన్ ద్వారా ఆడితే మంచి భవిష్యత్తు ఉంటుందో తేల్చుకోలేని దుస్థితిలో నేడు జిల్లా క్రీడాకారులున్నారు.

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం జిల్లాలో పదేళ్ల క్రితం వరకు క్రీడకు ఒక సంఘం ఉండేది. నేడు ఒక్కొక్క క్రీడకు రెండు నుంచి నాలుగు సంఘాలు ఏర్పడ్డాయి. కబడ్డీలో మూడు సంఘాలు, తైక్వాండోలో మూడు సంఘాలు, సేపక్ తక్రాలో రెండు సంఘాలు.. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రధాన క్రీడల్లో సంఘాల సంఖ్య పెరిగిపోయింది. దీంతో గత ఐదేళ్ల కాలంలో ఏ క్రీడకు ఆడినా సరైన సర్టిఫికెట్లు లేక క్రీడాకారులు ఉజ్వల భవిష్యత్తును కోల్పోయారు. సర్టిఫికెట్లు లేక ఉద్యోగ అవకాశాలకు ఎంతో మంది దూరమయ్యారు. చివరికి క్రీడా సంఘాలన్నీ ఒలింపిక్ అసోసియేషన్ కిందకు రావల్సి ఉంది. అటువంటి మార్గదర్శకంగా ఉండే ఒలింపిక్ అసోసియేషన్ కూడా రాష్ట్రంలో రెండుగా చీలిపోయింది. దీంతో క్రీడా సంఘాలు కూడా అదే విధంగా ముక్కలయ్యాయి. అసోసియేషన్ తమకే సొత్తు అన్నట్లు కొందరు వ్యవహరించడం, పదవి వ్యామోహం కారణంగా అసోసియేషన్లు పుట్టగొడుగుల్లా ఏర్పడుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మంత్రి ప్రత్యేక దృష్టి

గత మూడేళ్లలో రాష్ట్రం తరపున జట్టును పంపించేందుకు సంఘాలు పోటీ పడ్డాయి. దీంతో అసోసియేషన్లను దూరం పెట్టి శాప్ ఆధ్వర్యంలో జాతీయ పోటీలకు జట్లను పంపించాల్సి న పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో అసోసియేషన్ల విషయంలో కోర్టుల్లో కేసులు వేయడం వల్ల ఏది గుర్తింపు కలిగిన సంఘమనేది తేలని పరిస్థితి తలెత్తింది. జిల్లాలోనూ అదే పరిస్థితి నెలకొంది. సంఘాలను గుర్తించే వరకు ఎవరి తరపున వారు పోటీలు నిర్వహించడం సాగింది తప్ప అంతిమంగా క్రీడాకారులకు అన్యాయం జరుగుతోంది. ఈ నేపథ్యంలో క్రీడా సంఘాలు పరిస్థితి, గుర్తింపు కలిగిన ఏవి? అనే విషయాలపై జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆరా తీశారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారిని పిలిచి గుర్తింపు కలిగిన క్రీడా సంఘాలు ఎన్ని, వాటి వివరాలు అందించాలని ఆదేశించారు.

గుర్తింపు ఉంటేనే?

జిల్లాకు క్రీడలో రాష్ట్రంలో మంచి గుర్తింపు ఉంది. అటువంటి మంచిపేరు రావాలంటే గుర్తింపు కలిగిన అసోసియేషన్ ఒకటి ఉంటే సాధ్యమవుతుంది. క్రీడా సంఘాలు అనేకం ఉండటం వల్ల ఉన్న మంచిపేరు పోతుంది. మరో వైపు క్రీడాకారులు ఏ అసోసియేషన్ ద్వారా ఆడితే మంచి భవిష్యత్తు ఉంటుందో తేల్చుకోలేని దుస్థితిలో ఉన్నారు. మంత్రి శ్రీనివాస్ స్పందించి జిల్లాలో క్రీడల అభివృద్ధికి క్రీడా సంఘాలని ఒకే తాటిపైకి తీసుకొని వస్తే ఉపయోగకరంగా ఉంటుంది. గుర్తింపు కలిగిన సంఘాలేవో తేలితే క్రీడాకారులకు మేలు చేకూరుతుంది. ఆ దిశగా చర్యలు చేపడతారో? లేదో? వేచిచూడాల్సిందే.

క్రీడా సంఘాలు వివరాలు సమర్పించాలి

జిల్లాలో గుర్తింపు పొందిన క్రీడా సంఘాలు మంగళవారం సాయంత్రంలోగా వివరాలు సమర్పించాలని డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడలు, క్రీడా సంఘాలు, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో క్రీడా పోటీలు, ఇతర అంశాలు నిర్వహిస్తున్న జిల్లా క్రీడా సంఘాలు వాటి గుర్తింపు వివరాలను డిఎస్‌డిఒ కార్యాలయంలో అందించాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 80741 16276, 9491767327 నంబర్లను సంప్రదించాలని కోరారు.

దాడులు, ఆస్తుల ధ్వంసం సరికాదు

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లో జిల్లాలో అనేక దాడులు, ఆస్తులు ధ్వంసం వంటి చర్యలకు పాల్పడ్డారని, ఇవి ఎంత మాత్రమూ సరికాదని వైసిపి జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఖండించారు. సోమవారం నగరంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగాలు తొలగిస్తామని కూటమి కింది స్థాయి నాయకులు భయపెట్టడం దారుణమన్నారు. వైసిపి కార్యకర్తలపై దాడులు దిగడం సరికాదన్నారు. దన్నానపేటలో మాజీ సైనికుడికి 25న నోటీసు ఇచ్చి, 27న మంది మార్బలంతో వెళ్లి కూల్చేసి, భయభ్రాంతులకు గురి చేశారన్నారు. పట్టణంలో నిరుద్యోగి ఉపాధి కోసం సర్వీస్ సెంటర్ పెట్టుకుంటే కార్పొరేషన్ వారు దాన్ని కూల్చేశారని చెప్పారు. ఆయన కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నాడని, కానీ పోయిన ఆస్తికి ఎవరు బాధ్యులని నిలదీశారు. తెర్లాం పంచాయతీలో టిడిపి సానుభూతి పరుడు చింతల వెంకటేష్.. అందరిలాగే కాలువపై కల్వర్టు కట్టుకుంటే కూల్చేశారని తెలిపారు. గ్రామాల్లో బుక్ కీపర్లను తొలగించారని, దీనిపై మంత్రిని జెడ్‌పి సమావేశంలో అడిగితే అటువంటిది లేదని చెప్పారని గుర్తుచేశారు. శృంగవరపుకోట, లక్కవరపుకోట, కొత్తవలసలో ఎటువంటి బైలా పాటించకుండా అకారణంగా తొలగించారని, దీనిపై కలెక్టర్ విచారణ జరపాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకంలో ఎప్పటి నుంచో ఉన్న నిర్వాహకులను మార్చేయడం, అధికారులను అడిగితే, ఎటువంటి ప్రభుత్వ ఉత్తర్వులు లేవని చెబుతున్నారన్నారు. జియ్యమ్మవలస మండలంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ వికలాంగుడిని అకారణంగా సీతంపేట బదిలీ చేశారని చెప్పారు. రెండు జిల్లాల కలెక్టర్లు అధికారులకు భరోసా ఇవ్వాలని, ప్రభుత్వ ఆదేశాలను మాత్రమే అమలు చేసేలా, గ్రీవెన్స్ ప్రకారం చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు. కూటమి పెద్దలు తమ దిగువ స్థాయి కేడర్‌ను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. సమావేశంలో వైసిపి నాయకులు పులిరాజు, నెక్కల నాయుడుబాబు పాల్గొన్నారు.

పారా ఒలింపిక్స్ విజేత లక్ష్మణ్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారా ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించిన బండారు లక్ష్మణ్ యాదవ్‌కు సోమవారం యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఇసరపు శేఖర్ యాదవ్ సత్కరించారు. సోమవారం నగరంలోని ప్రదీప్‌నగర్‌లో ఉన్న సమితి కార్యాలయంలో ఈ సత్కారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి అకాడమీ చైర్మన్ కృష్ణారెడ్డి, డి.రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేషన్'లో 13 వినతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు 13 వినతులు వచ్చాయి. కమిషనర్ ఎం.ఎం.నాయుడు వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత విభాగ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎసిపి అమ్మాజీరావు, ఇఇ కె.శ్రీనివాసరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 205 వినతులు

వినతులకు గడువులోగా పరిష్కరించాలి : జెసి కార్తీక్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు వివిధ సమస్యలపై ప్రజల నుంచి 205 వినతులు అందాయి. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ ఎస్.డి.అనిత వినతులు స్వీకరించారు. రెవెన్యూ శాఖ సమస్యలపై 135, డిఆర్‌డిఎకు 17, జిల్లా పంచాయతీ శాఖకు 15, వైద్యశాఖకు 7, మున్సిపల్ శాఖకు 16 చొప్పున, మిగిలినవి ఇతర శాఖలకు సంబంధించిన వినతులు అందాయి.

అధికారులు ఏ రోజు వినతులు ఆ రోజే చూడాలని, నాట్‌వ్యూ ఉండకూడదని, గడువు లోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. అధికారులు రీ ఓపెన్ అయిన వాటిని కూడా నిర్దేశిత గడువులోగా పంపాలన్నారు. ఆన్‌లైన్‌లో ఏ దశలో కూడా పెండింగ్ కనపడకూడదని స్పష్టంచేశారు. ఎన్నికల ముందు పలు శాఖల వద్ద పెండింగ్ ఉన్న 18 వినతులు సోమవారమే పరిష్కరించాలని సూచించారు.

– బొబ్బిలిలోని సిబిసిఎన్‌సిఎం పాఠశాల అమ్మకాన్ని ఆపాలని విదశం ఐక్యవేదిక నాయకులు వినతి అందించారు. ఆ పాఠశాల కరస్పాండెంట్‌గా ఉన్న ఎం.రత్నకుమార్ అమ్మకానికి కుట్ర పన్నుతున్నారని వివరించారు. కార్యక్రమంలో కన్వీనర్ బోసి వెంకట్రావు, నాయకులు దాడి మోహన్ రావు పాల్గొన్నారు.

– టిడ్కో ఇళ్లకు అసలే కట్టలేమంటే వడ్డీలు కట్టాలంటూ బ్యాంకు అధికారులు నోటీసులతో తమను వేధిస్తున్నారని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు గ్రీవెన్స్‌లో వినతి అందించారు. గత ప్రభుత్వ హయాంలో ఇటీవల కొందిమందికి తాళాలిచ్చి, ఇప్పుడు రుణాలకు వడ్డీ కట్టాలని వేధిస్తున్నారని విన్నవించారు.

– చాకలిరేవుల కబ్జాలను అరికట్టాలని జిల్లా రజక సంఘ సమాఖ్య సభ్యులు గ్రీవెన్స్‌లో వినతి అందించారు. రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు గుర్జాపు సత్యారావు, కార్యదర్శి మద్ది పైడిరాజు పాల్గొన్నారు.

– విజయనగరానికి మరో అదనపు తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని టిడిపి నాయకులు గ్రీవెన్స్‌లో జెసికి వినతి అందించారు. జనాభా పెరుగుతున్న దృష్ట్యా నగరంలో నీటి కొరత ఎక్కువగా ఉందని, రెండు మూడు రోజులకు ఓసారి నీరందిస్తే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. 2018లో కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు.. నాగావళి, చంపావతి నదుల అనుసంధానం ద్వారా తాగునీటి కొరతను అధిగమించవచ్చని ప్రారంభించిన కార్యక్రమం అలానే ఉండిపోయిందని చెప్పారు. దాన్ని ఇప్పుడు పూర్తి చేస్తే తాగునీటి కొరతను నివారించవచ్చని వివరించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, ఎంపిటిసి వేచలపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నగరంలో తాగునీటి సమస్యను జెసికి వివరిస్తున్న టిడిపి నాయకులు

పారిశుధ్య, తాగునీటి సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించే లక్ష్యంతో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు జెసి కె.కార్తీక్ చెప్పారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆవిష్కరించారు. పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో 9502349267 టోల్‌ఫ్రీ నంబరుతో కంట్రోల్ రూం పనిచేస్తుందని డిపిఒ శ్రీధర్‌రాజా తెలిపారు. ఏ గ్రామంలో పారిశుధ్యం, తాగునీటి సమస్యలు ఉన్నా ఈ ఫోన్ నంబరుకు తమ సమస్యలు తెలియజేయవచ్చని చెప్పారు.

ముగ్గురు విద్యార్థులకు ఆర్థిక సహాయం

జిల్లాలోని ప్రతిభావంతులైన ముగ్గురు విద్యార్థుల ఉన్నత విద్యకు ఒక ప్రయివేటు సంస్థ ఆర్థిక సహాయాన్ని జెసి కె.కార్తీక్ చేతుల మీదుగా అందించింది. క్రెడిట్ ఏక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద అత్యుత్తమ మార్కులతో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ముగ్గురు పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15 వేల వంతున ఆర్థిక సహాయం అందించింది. ఈ కార్యక్రమంలో క్రెడిట్ ఏక్సెస్ గ్రామీణ్ సంస్థ ప్రాంతీయ మేనేజర్ బి.వెంకటరమణ, ఏరియా మేనేజర్ చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పి గ్రీవెన్స్‌కు 35 అర్జీలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్‌పి వకుల్ జిందాల్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 35 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆయన సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని సూచించారు. పరిష్కారానికి చర్యలు చేపట్టి, వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. ఏడు రోజుల్లో పరిష్కరించి, తీసుకున్న చర్యలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి అస్మా ఫర్హీన్, డిటిసి డిఎస్‌పి ఎం.వీరకుమార్, స్పెషల్ బ్రాంచి సిఐ నర్సింహమూర్తి, డిసిఆర్‌బి ఎస్ఐ మురళి, తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి జిందాల్

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

జిల్లాలో ఎఎస్ఐలుగా పనిచేస్తూ ఇటీవల ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందిన ముగ్గురిని సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి వకుల్ జిందాల్ అభినందించారు. పోలీసు కంట్రోల్ రూంలో పనిచేస్తున్న ఎఎస్ఐ అప్పారావు, గజపతినగరం ఎఎస్ఐ మాతామూర్తి, రామభద్రపురం ఎఎస్ఐ చిన్నయ్యకు ఎస్ఐలుగా ఉద్యోగోన్నతులు లభించాయి. ఉద్యోగోన్నతులతో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఎస్‌పి వారికి సూచించారు. సమర్థవంతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

ఎపిజిఎల్ఐ బకాయిలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎపిజిఎల్ఐ నుంచి రావల్సిన బకాయిలు చెల్లించాలని సోమవారం సాయంత్రం జిల్లా ఖజానా శాఖ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ధర్నాను ఉద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ ఎపిజిఎల్ఐ బకాయిలు ఇవ్వకుండా ఆ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఉద్యోగుల జీతాల నుంచి వసూలు చేసిన డబ్బులకు బాండ్లు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే బాండ్లు ఇవ్వాలని, రుణాలు, క్లెయిమ్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్‌చంద్ర, ఈశ్వరరావు, రాజారావు, తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

ఖజానా శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

రోగాలు ప్రబలకుండా చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మలేరియా, డెంగీ వంటి రోగాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పారిశుధ్య కార్యదర్శులకు, ఎఎన్‌ఎంలకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.ఎం.నాయుడు ఆదేశించారు. ఈ మేరకు జిల్లా మలేరియా అధికారి మణి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తితో కలిసి కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఇప్పటివరకు సచివాలయాల వారీగా పారిశుధ్య పరంగా చేపడుతున్న చర్యలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. నిర్లక్ష్యం వహిస్తే భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఎక్కడా నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని చెప్పారు. దోమల వృద్ధి కేంద్రాలను గుర్తించి వాటిని నిరోధించాలని తెలిపారు. ఫ్రైడే డ్రైడేను ప్రజలు కచ్చితంగా పాటించేలా చైతన్యం కల్పించాలన్నారు. ప్రజా అవగాహనతోనే దోమల నియంత్రణ సాధ్యమవుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ

పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి ● నైపుణ్య కమిటీ సమావేశంలో జెసి కార్తీక్

విజయనగరంకోట : స్థానిక వాస్తవిక అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఉపాధి శిక్షణ సంస్థలకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా నైపుణ్య కమిటీ సమావేశం జరిగింది. సంకల్ప్ కార్యక్రమం గురించి ముందుగా డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. నైపుణ్య శిక్షణలో భాగంగా అకడమిక్, నాన్ అకడమిక్, ఉద్యోగాల కల్పన అంశాలను జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి గోవిందరావు తెలిపారు. ఎపిఎస్ఎస్‌డిసి, ఎస్‌బిఐ -ఆర్‌సెట్టి, సీడాప్, నైరేడ్, జనశిక్షణా సంస్థాన్, ఎన్ఎసి తదితర సంస్థలు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలు, కల్పిస్తున్న ఉద్యోగాల గురించి ఆయా సంస్థల ప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయ నిర్మాణం జోరుగా జరుగుతోందని, ఇక్కడ సేవా రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువ లభించే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలోని పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించేలా పరిశ్రమల శాఖ కృషి చేయాలని ఆదేశించారు. సమావేశంలో నాబార్డు డిడిఎం నాగార్జున, మెప్మా పీడీ సుధాకరరావు, పశు సంవర్థకశాఖ జెడి వైవి రమణ, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, మత్స్యశాఖ డిడి నిర్మలాకుమారి, జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.అరుణ, ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ టివి గిరి, వివిధ శిక్షణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-విజయనగరం

రక్తదానం ప్రాణదానంతో సమానమని సత్యా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు తెలిపారు. సత్యా విద్యాసంస్థల ఆధ్వర్యంలో అత్యవసరం రక్తదాన శిబిరాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంకులో సోమవారం నిర్వహించారు. ఈ శిబిరంలో 35 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తదాతలను శశి భూషణరావు అభినందించారు. 18 ఏళ్లు నిండిన యువత ప్రతిఒక్కరూ కూడా రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం శశిభూషణరావును రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి కె.సత్యం సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధి ఎం.రాము, డి.గౌరీశంకర్, కళాశాల సిఎస్ఒ ఎం.సత్యనారాయణ, ప్రొఫెసర్ రవికుమార్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థిని అభినందిస్తున్న మజ్జి శశిభూషణరావు

లెండిలో ముగిసిన వర్క్‌షాప్

డెంకాడ: లెండి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఆ కళాశాల టెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో గత మూడురోజులుగా జరుగుతున్న సెలోనిస్ ప్రాసెస్ మైనింగ్ టెక్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. ఈ వర్క్‌షాప్‌ను ఎడ్యు-స్కిల్స్ అసోసియేట్ మేనేజర్ ఫర్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్‌వి పవన్ కుమార్ నిర్వహించారు. సెలోనిస్ ప్రాసెస్ మైనింగ్ అనేది డిజిటల్ ట్రేస్‌లను విశ్లేషించడం, వారి వ్యాపార కార్యకలాపాల డిజిటల్ జంటను సృష్టించడం ద్వారా నిజ సమయంలో వ్యాపారాలు ఆప్టిమైజ్ చేయడంలో సహాయపడే ఒక అధునాతన సాధనమన్నారు. ఈ ముగింపు సభలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.రామారెడ్డి, లెండి ఇన్‌స్టిట్యూట్ పాలకమండలి సభ్యుడు కె. సురేష్, శిక్షణ అండ్ ప్లేస్‌మెంట్ డీన్ జి.ప్రకాష్ బాబు, బీఎస్‌సిఇ విభాగాధిపతి డాక్టర్ ఎ. రామారావు, స్కిల్ కోఆర్డినేటర్ మధు బాబు, ఈవెంట్ కోఆర్డినేటర్ ఎవిడిఎస్ ప్రభు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బేబినాయనకు అరుదైన గౌరవం

పుస్తకాన్ని బహూకరిస్తున్న ఎమ్మెల్యే

బొబ్బిలి: బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయనకు అరుదైన గౌరవం దక్కింది. ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా మంగళగిరి అరణ్య భవనంలో సోమవారం నిర్వహించిన పులుల ఫోటో ఎగ్జిబిషన్‌లో బేబినాయన తీసిన ఫోటోలను ప్రదర్శించారు. అటవీ ప్రాంతాలలో పర్యటించి వన్య ప్రాణుల ఫోటోలు తీయడం బేబినాయనకు ఇష్టం. అటవీ ప్రాంతాలలో బేబినాయన విస్తృతంగా పర్యటించి వన్య ప్రాణులను కెమెరాలో బంధిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా అటవీశాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసిన బేబినాయన తాను తీసిన పులుల ఫోటోలను బహూకరించారు. దీంతో ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనలో పులుల ఫోటోలను ప్రదర్శనకు పెట్టాలని పవన్ కళ్యాణ్ కోరడంతో బేబినాయన పులుల ఫోటోలను ప్రదర్శనలో పెట్టారు. పులుల ఫోటోలను తిలకించిన పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యే బేబినాయనను అభినందించారు.

రైతులకు అండగా బేబినాయన

బొబ్బిలి: ఎమ్మెల్యే బేబినాయన రైతులకు అండగా ఉంటున్నారు. తెర్లాం మండలం ఆమిటి, సతివాడ గ్రామాల రైతులకు తోటపల్లి కాలువ నుంచి సాగునీరు సక్రమంగా అందకపోవడంతో సొంత నిధులతో బేబినాయన కాలువలో పూడికలు తొలగించారు. పాతబొబ్బిలి బైరిసాగరం చెరువు నుంచి గొల్లపల్లి వెంగళరాయుడు చెరువుకు సాగునీరు వెళ్లే కాలువలో పూడికలు పేరుకుపోవడంతో రైతులకు సక్రమంగా సాగునీరు అందడం లేదు. దీంతో రైతులు ఎమ్మెల్యే బేబినాయనకు సమస్యను వివరించడంతో కాలువలో పూడికలు తీసేందుకు సొంత నిధులు బేబినాయన సమకూర్చారు. ఆ నిధులతో కాలువలలో పూడికలను జెసిబితో సోమవారం తొలగించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిమ్మలపాడులో న్యాయ అవగాహన సదస్సు

బొబ్బిలి రూరల్: మండలంలోని నిమ్మలపాడులో సోమవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సుకు, ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సీనియర్ సివిల్ జడ్జిఎస్.ఆరుణశ్రీ న్యాయ అవగాహన సదస్సు నిర్వహించి చట్టాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి గిరిజనులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వైద్యులు రమ్యసంశీ, ఎం సంధ్యారాణి వైద్య పరీక్షలు సీజనల్ వ్యాధులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిటిసి శివ, సర్పంచ్ పి.వేలంగిరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బంగారయ్యపేట పాఠశాల పరిశీలన

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

వేపాడ: మండలంలోని కొండగంగుపూడి గ్రామ సచివాలయ పరిధిలో గల బంగారయ్యపేట ప్రాథమిక పాఠశాల సమస్యలపై సోమవారం ప్రజాశక్తిలో 'బడియందు లోపల రెండు చోట్ల కష్టాల్..!' అని ప్రచురితమైన కథనానికి స్పందించిన జిల్లా విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు ఎంఇఒ జి.జగదీశ్వరరావు బంగారయ్య పేటలో పాఠశాలను పరిశీలించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి పాఠశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఎస్ఆర్‌పురం, బొద్దాం ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు.

ప్రహరీ నిర్మాణాన్ని కూల్చివేయడం దారుణం

నెల్లిమర్ల: రిటైర్డు ఆర్మీ జవాన్ ఇంటి ప్రహరీ నిర్మాణాన్ని కూల్చివేయడం దారుణమని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దన్నాన పేటలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ ఇళ్ల ప్రభుత్వ స్థలంలో ఉండగా అధికార్లు ప్రహరీ గోడను కూల్చి వేయడం దారుణమన్నారు. మండలం, నగర పంచాయతీలో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని నెల్లిమర్ల, జరజాపుపేట కొంతలవాని చెరువుల్లో గుడుల పేరిట అక్రమ నిర్మాణాలు చేశారని ఇవన్నీ అధికారులకు కనిపించ లేదా అని ప్రశ్నించారు. రెవెన్యూ అధికార్లు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. అధికార్లు స్పందించి ప్రభుత్వ స్థలాలు, చెరువుల్లో ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అక్కివరంలో 'ఇకో క్లబ్'

డెంకాడ: మండలంలోని అక్కివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇకో-క్లబ్ పచ్చని చెట్టు-ప్రగతికి మెట్టు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్ రావు సోమవారం మొక్కలు నాటారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి కంది సూర్యనారాయణ, సర్పంచ్ కంది కిరణ్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ, ఆశాలను వేధిస్తున్న దుండగుడు

బొబ్బిలి: అంగన్వాడీ, ఆశ కార్యకర్తలను గుర్తు తెలియని దుండగుడు ఫోన్ చేసి వేధిస్తున్నాడు. మండలంలోని పిరిడి గ్రామానికి చెందిన ఒక ఆశ కార్యకర్తకు డిఎం అండ్ హెచ్‌ఒ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నానని చెప్పి గుర్తు తెలియని దుండగుడు 9470080473తో ఫోన్ చేసి అంగన్వాడీ కార్యకర్తల నెంబర్లు అడిగాడు. డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నట్లు చెప్పడంతో ఆమె అంగన్వాడీల నెంబర్లు ఇచ్చింది. అంగన్వాడీలకు, ఆశ కార్యకర్తలకు రాత్రి సమయంలో వీడియో కాల్స్ చేస్తూ వేధిస్తున్నాడు. ఫోన్ చేసి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ప్రతిరోజు వేధించడంతో ఆశ కార్యకర్తలు, అంగన్వాడీలు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని దుండగుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అటువంటి వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు కోరారు.

భారతీయ సంస్కృతి పులులకు విలువనిస్తుంది

శృంగవరపుకోట: భారతీయ సంస్కృతి పులులకు అధిక విలువనిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 20వ దశాబ్దం ప్రారంభం నుంచి పులుల సంఖ్య తగ్గుతూ వస్తుందని ఒక నివేదిక ప్రకారం పులులు వాటి పూర్వ పరిధిలో 93శాతం కోల్పోయాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి ఈశ్వరు, పి భాస్కరరావు, అధ్యాపకులు ఎస్కె వలి ఖాన్, డి స్వామినాథ్, కె అప్పలరాజు, డి లక్ష్మణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నెల్లిమర్ల: స్థానిక సికెఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ చేసినట్టు ప్రిన్సిపాల్ ఎం.సత్య నారాయణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. గత ప్రభుత్వంలో పుస్తకాలు సరఫరా చేయక పోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత పుస్తకాల ఇబ్బందులను తొలగింపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

ప్రజాస్వామ్యయుతంగా ఎస్‌పిఎల్ ఎన్నికలు

బొబ్బిలి: మున్సిపాలిటీలోని గొల్లపల్లి శ్రీనివాసగోపాల మున్సిపల్ పాఠశాలలో సోమవారం ప్రజాస్వామ్యయుతంగా ఎస్.పి.ఎల్ ఎన్నికలు నిర్వహించారు. సోమవారం ఎన్నికలు నిర్వహించగా ఐదుగురు విద్యార్థులు పోటీ చేశారు. ఐదుగురికి గుర్తులు కేటాయించి తరగతి గదులలో ప్రచారం చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 6 నుంచి 10 తరగతి వరకు చదువుతున్న 402మంది విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలను ఎంఇఒ-2 శ్రీనివాస్ పరిశీలించి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అభినందించారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- గుర్ల

మండలంలోని కెల్ల గ్రామానికి చెందిన అంపోలు అప్పలనాయుడు (31) గడ్డి మందు తాగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన భార్య అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో మనస్థాపానికి గురై ఆయన ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి మృతి చెందాడు. గుర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి

ప్రజాశక్తి- మెంటాడ

రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యా రాణి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రితో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరయ్యారు. సమావేశంలో ముందుగా వ్యవసాయానికి కావలసిన విత్తనాలు, ఎరువులు, ఇకెవైసి గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. జల జీవన మిషన్ ద్వారా తాగునీటి సౌకర్యాలు, సిసి రోడ్లు బిటి రోడ్లు, హౌసింగ్, విద్యుత్ శాఖ అలసత్వం గురించి, ఆరోగ్య శాఖ, శానిటేషన్, గ్రామాలలో పారిశుధ్య పనులపై ఆరా తీశారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని విద్యుత్ శాఖ అసమర్థత వల్ల కొందరు

మాట్లాడుతున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని చెప్పారు. మంత్రి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మండలంలో ముఖ్యంగా తాగునీరు, రహదారుల నిర్మాణాలు జరిగే విధంగా తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. దేశంలోనే చెక్ పవర్ ఉన్న సర్పంచ్‌లకు నిధులు లేకుండా పోయావని ఇక నుంచి మీ ఎకౌంట్‌లో డబ్బులు పడతాయని మీ గ్రామాన్ని చక్కగా మీరే అభివృద్ధి పదంలో నడిపించవచ్చని అన్నారు. ఇక్కడ ప్రజలకు వరమో, శాపమో తెలియదు కానీ గ్రీన్ ఫీల్డ్ హైవే రింగ్ రోడ్డుల నిర్మాణం వల్ల గజపతినగరం, మెంటాడ మధ్య రహదారులు, బిటి రోడ్లు దారుణంగా పాడైపోయాయని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆమె గుర్తు చేశారు. హైవే అధికారులతో ఆర్అండ్‌బి అధికారులు మాట్లాడి తన వద్దకు తీసుకు వస్తే రోడ్లు బాగు గురించి మాట్లాడుతానని చెప్పారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షులు తెట్టంగి దుర్గ, సారిక ఈశ్వరరావు, జెడ్‌పిటిసి లెంక సన్యాసప్పల నాయుడు, ఎంపిటిసిలు, సర్పంచులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనసేనతోనే ప్రయోజనం

ప్రజాశక్తి - భోగాపురం

జనసేన క్రియాశీలక సభ్యత్వం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఆ పార్టీ మండల అధ్యక్షులు వందనాలు రమణ అన్నారు. భోగాపురం గ్రామంలో సోమవారం జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ సభ్యత్వం పొందిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లయితే రూ.5 లక్షలు ఆర్థిక సాయం, ప్రమాదంలో గాయపడితే 50 వేల రూపాయలు జనసేన తరపున ఆర్థిక సాయం అందజేస్తారని అన్నారు. ఎమ్మెల్యే లోకం మాధవి ఆదేశాలతో ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు జనసేన సభ్యత్వం తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బొల్లు త్రినాథ్, బొడ్డ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రజా సంఘాల వినతి

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో గుర్లగెడ్డ మినీ రిజర్వాయిర్ నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి ప్రజా సంఘ నేతలు చెరకాన రామునాయుడు, గొర్లె సన్యాసిరావు, సిపిఎం మండల నాయకులు రాకోటి రాములు తదితరులు విన్నవించారు. సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఆమె పాల్గొనగా ఆమెకు గిరిజనుల సమస్యలపై పలు వినతి పత్రాలు అందజేశారు. వనిజ రెవెన్యూ పరిధిలో 140 ఎకరాల గెడ్డ పోరంబోకు భూమిలో దళిత, గిరిజనులు సాగుచేస్తున్నారని దానికి గెడ్డపోరంబోకు పదాన్ని తొలగించి ప్రభుత్వ బంజరు భూమిగా నమోదు చేసి ఎన్నోఏళ్లుగా సాగుచేస్తున్న దళిత, గిరిజనులకు పట్టాలు ఇప్పించాలని కోరారు. గిరిజన ప్రాంతంలో ఉన్న ఈ మండలాన్ని షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలని, ఐటిడిఎ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, గిరిజన గ్రామాల అటవీ ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు తీసుకు వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. చంపావతి నదిపై లక్ష్మీపురం, ఆగూరు గ్రామాలకు బ్రిడ్జిలు, కాజ్‌వే నిర్మాణాలు చేపట్టాలని ఆమెకు వినతినిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన మండల కార్యదర్శి టి. సోములు, వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి మంగళగిరి అప్పలనరసయ్య, బాకా వెంకటి తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: భూసమస్యల పరిష్కారానికే అధిక ఫిర్యాదులు వస్తున్నాయని తహశీల్దార్ సులోచనారాణి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ముఖ్య శాఖల అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. అధిక శాతం గ్రామాల నుంచి భూసమస్యల పై ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఇటీవల నిర్వహించిన భూ సర్వేలో తప్పులు నమోదయ్యాయని, సక్రమంగా అమ్మకాలు, కొనుగోళ్లకు రికార్డులు సిద్ధంగా లేకపోవడం 1బిలో పట్టాదారు పాసుపుస్తకాల్లో నమోదు కాబడిన విస్తీర్ణం చూపించక పోవడం వంటివి జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహశీల్దార్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఈశ్వరమ్మ, ఎంఇఒ తిరుమల ప్రసాద్, పాల్గొన్నారు.

పంచాయతీకి ఆదాయాన్ని పెంచే చర్యలు తీసుకోండి

శృంగవరపుకోట: ఎస్‌కోట మేజర్ పంచాయతీకి ఆదాయాన్ని పెంచే చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జనసేన మండల నాయకులు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని పాత బస్టాండ్, దేవి కూడలి వద్ద గల పంచాయతీ వ్యాపార సముదాయాలలో గల షాపులను బినామీలకు అద్దెకు ఇచ్చి లీజు దారులు పెద్ద ఎత్తున పంచాయతీ ఆదాయాన్ని పక్క దారి పట్టిస్తున్నారని చెప్పారు. దీనిపై విచారణ జరిపి బహిరంగ వేలం ద్వారా పంచాయతీ షాపులను లీజుదారులకు ఇచ్చి పంచాయతీ ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కోరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తాండ్రంగి చంటి, పెనుమత్స సురేష్ రాజు, మెపాడ చిన్ని, దొగ్గ రమణ తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: జెసికి సమస్యను వివరిస్తున్న పాలవలస గౌరు

అధికారుల నిర్లక్ష్యమే కారణం

బాడంగి: ఎరుకులపాకులు ప్రాథమిక పాఠశాల నుంచి 3,4,5 తరగతుల పిల్లలను గజారాయునివలస యూపీ స్కూల్‌కి పంపించడం వెనుక మండల విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యం ఉందని దీనిపై విచారణ చేపట్టాలని గజరాయునివలస ఎంపిటిసి పాలవలస గౌరు జెసి కార్తీక్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో జెసికి వినతి పత్రాన్ని అందించారు. విద్యా సమస్యలపై మంత్రి లోకేష్‌కు తానిచ్చిన వినతపత్రంపై మండల ఎంఇఒ అధికారులు స్పందించిన తీరు చాలా ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ విషయంపై జెసి స్పందిస్తూ గిరిజన విద్యార్థుల భవిష్యత్తు కోసం కమిషనర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని చెప్పినట్లు గౌరు తెలిపారు.

వ్యవసాయానికి నష్టం చేకూర్చే బడ్జెట్

ప్రజాశక్తి- గంట్యాడ

వ్యవసాయానికి తీవ్రమైన నష్టం కలిగించే బడ్జెట్‌ను కేంద్రంలో మోడీ ప్రభుత్వం రూపొందించిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు అన్నారు. సోమవారం బుడతనాపల్లి గ్రామంలో కేంద్ర బడ్జెట్ పత్రాలను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని పూర్తిగా కార్పొరేట్లకు అప్పగించడం ద్వారా గరిష్ఠ లాభాలు పొందేందుకు కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. వ్యవసాయ అనుబంధ రంగ కేటాయింపులో 21.2 శాతం కోత పడిందని తెలిపారు. కనీసం మద్దతు ధర కల్పించి పంటలు కొనుగోలుకు చర్యలు లేవని మండిపడ్డారు. ఉపాధి హామీ, పిఎంకిసాన్, పిఎం పసల్ బీమా యోజన పథకాలకు మధ్యంతర బడ్జెట్‌లో కేటాయించిన దానికంటే ఎక్కువ కేటాయింపులు ప్రకటించలేదని ఆగ్రహించారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ రైతులందరూ తీవ్రంగా వ్యతిరేకించాలని ఎక్కడకక్కడ బడ్జెట్ కాపీలను దగ్ధం చేయాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అప్పారావు, రాము, రైతులందరూ పాల్గొన్నారు.

బడ్జెట్ కాపీలు దగ్ధం

శృంగవరపుకోట: వ్యవసాయాన్ని పూర్తిగా కార్పొరేట్లకు అప్పగించడం ద్వారా గరిష్ట లాభాలు పొందేందుకు కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదనలు ఉన్నాయని ఎపి రైతు జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, వ్యవసాయ కార్మిక సంగం జిల్లా అధ్యక్షులు జి అప్పారావు, రైతు సంగం సహాయ కార్యదర్శి

గంట్యాడ: బడ్జెట్ ప్రతులను దగ్ధం చేస్తున్న రైతు సంఘం నాయకులు

మద్దిల రమణ ఆధ్వర్యంలోపై దేవి కూడలిలో సోమవారం బడ్జెట్ కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల కేటాయింపుల్లో 21.2 శాతం కోత పడిందన్నారు. కనీస మద్దతు ధర కల్పించి పంటల కొనుగోలుకు చర్యలు లేవని మండిపడ్డారు. కార్పొరేట్లు, వారి ఏజెంట్లకు భూ మోసాలను సులభతరం చేసేందుకు ఆరు కోట్ల మంది రైతులు, వారి భూమిని కేంద్రీకృత డిజిటల్ సిస్టమ్‌లలో నమోదు చేయాలనే ప్రతిపాదన ఉందని ఆరోపించారు. తక్షణమే సవరించిన బడ్జెట్‌లో 60శాతంగా ఉన్న రైతులకు ప్రయోజనం సమకూరే విధంగా బడ్జెట్ తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులతో పాటు రైతులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేకు వివరిస్తున్న అర్చకులు, టిడిపి నాయకులు

దేవస్థానాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానాన్ని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి సోమవారం సందర్శించారు. భూముల వివాదం, దేవస్థానంలో జరిగే పూజా కార్యక్రమాలు వివరాలు తెలుసుకున్నారు. ఆలయాభివృద్ధి కోసం పనులు ఎంతవరకు వచ్చాయని పరిశీలించారు. అక్కడ ఉన్న ప్రజలతోటి, పాలకమండలి, పూజారులతోని మాట్లాడి విషయాలు తెలుసుకొని ఆలయ అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర పరిశీలకులు, నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ సువ్వాడ రవి శేఖర్, నెల్లిమర్ల మండల టిడిపి అధ్యక్షులు కడగల ఆనంద కుమార్, నెల్లిమర్ల మండల జనసేన పార్టీ నాయకులు ఎం ఎం నాయుడు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గిరిజనుల హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- మెంటాడ

గిరిజనులకు గిరిజన విద్యార్థులకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ కె విజయ కళ్యాణి అన్నారు. మండలంలో సోమవారం కెజిబివి పాఠశాలలో నల్సా సహకారంతో జిల్లా కోర్టు న్యాయ సేవ సదన్ కార్యదర్శి ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ గిరిజనులకు రాజ్యాంగం న్యాయబద్ధమైన హక్కులను కల్పించిందని వాటిపై విద్యార్థులందరికీ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నేటి పరిస్థితిలను బట్టి డ్రగ్స్ విచ్చల విడితనమైందని యువత చెడు మార్గాలలో ఉంటూ వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఎట్టి పరిస్థితుల్లోనూ వాటి జోలికి వెళ్ళకూడదని సూచించారు. ప్రతి విద్యార్థి

డిఎల్ఎస్ఎ సెక్రటరీ విజయ కళ్యాణి

మొదటిగా ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తూ విద్యార్థులను ఆరోగ్యంగా ఉండేలా చూడాలన్నారు. ప్రతి విద్యార్థి గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు మెడికల్ క్యాంప్ ప్రారంభించారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ కె. మోహన్‌రావు, జిసిడిఒ పి. మాలతి విజయనగరం, గజపతినగరం జూనియర్ సివిల్ కోర్ట్ నుంచి అడ్వకేట్లు వాసుదేవరావు, జి సూర్యనారాయణ, గజపతినగరం కోర్టు సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నల్ల ఇసుక సీజ్

ప్రజాశక్తి- పూసపాటిరేగ

మండలంలోని కొల్లాయివలస తీర ప్రాంతంలో అక్రమ నల్ల ఇసుక నిల్వలను ఆదివారం రాత్రి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నల్ల ఇసుకను కొల్లగొట్టేస్తున్నారంటూ శనివారం ప్రజాశక్తి పత్రికలో వచ్చిన వార్తకు మైన్స్, ఫారెస్ట్, రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించారు. కొల్లాయివలస తీర ప్రాంతంలో రామకృష్ణ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలన చేశారు. నాలుగు చోట్ల నల్ల ఇసుక డంపులను గుర్తించారు. సుమారుగా 8 ట్రాక్టర్ల ఇసుకను పూసపాటిరేగ పోలీస్ స్టేషన్‌కు తరలించి నట్లు ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. ఇసుక డంపులపై ఆరా తీయగా అపరిచితులు సముద్రపు ఒడ్డు నుంచి నల్ల ఇసుకను సేకరించి అక్రమంగా

అధికారులు సీజ్ చేసిన నల్ల ఇసుక

తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. మైన్స్ అధికారులతో పాటు ఫారెస్ట్ అధికారులు రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో నాలుగ ఇసుక డంపు నుంచి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించామన్నారు. ఇసుక డంపు చేస్తున్న వారిని గుర్తిస్తున్నామన్నారు. తనతోపాటు మైన్స్ అధికారులు, రాయల్‌టి ఇన్‌స్పెక్టర్ బందరు శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్ కే పైడితల్లి, ఫారెస్ట్ అధికారులు సెక్షన్ ఆఫీసర్ పి మధుమోహన్‌రావు, బీట్ ఆఫీసర్ పి పూజ, వీఆర్వో ఉన్నారన్నారు.

పని ప్రదేశాల్లో వేధిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - భోగాపురం

పని ప్రదేశాలలో మహిళా ఉద్యోగులు పట్ల సెక్సువల్ వేధింపులకు గురి చేస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ ఎం సురేష్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు చట్టంపై శిక్షణ కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులతో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళలను వేధిస్తే ఈ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపిడిఒ చంద్రకళ, ఐసిడిఎస్ సిడిపిఒ ఎస్తేరు రాణి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో కమిటీలు వేసుకోవాలన్నారు. ఎవరైనా వేధిస్తే 30 రోజుల్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ ఫిర్యాదు పై కమిటీలు విచారణ జరిపి 90 రోజుల్లో శిక్ష వేస్తాయని అన్నారు. వేధింపులకు గురి చేసిన వ్యక్తికి బదిలీ లేదా పదోన్నతులు నిలిపివేయడం, ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయడం వంటి శిక్షలు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సురేష్, ఎసిడిపిఒ తవిటినాయుడు, ఎఒ హరికృష్ణ, ఎపిఒ ఆదిబాబు, ఎటిఎం రమణ, ఉద్యానవన శాఖ అధికారి జ్యోత్స్న, సూపర్‌వైజర్లు శాంతి కుమారి, నాగమణి, సచివాలయ మహిళా పోలీసులు, విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి రూ.12 లక్షలు

ప్రజాశక్తి- బొబ్బిలి

తెర్లాం మండలం నెమలాం గ్రామానికి చెందిన బొమ్మరిల్లు చంద్రమౌళి కుమారుడు శ్రావణ్ కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పేద కుటుంబం కావడంతో ఎమ్మెల్యే బేబినాయన శ్రావణ్ కుమార్ శస్త్ర చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి రూ.12లక్షలు మంజూరు చేపించి చెక్కును తండ్రి చంద్రమౌళికు ఎమ్మెల్యే బేబినాయన అందజేశారు.

'సూపర్ సిక్స్' అమలు చేయాలి: కడుబండి

ప్రజాశక్తి- కొత్తవలస

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి వైసిపి నాయకులు, కార్యకర్తలపై పలు ప్రాంతాలలో దాడులు జరిగిన తీరు బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సమీక్షల పేరుతో కాలియాపన చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 45 రోజులు గడిచినా ఉచిత బస్సు, అన్నా క్యాంటీన్, అమ్మకు వందనం ఏ ఒక్క పథకం అమలు కాలేదన్నారు. నాడు జగనన్న ప్రభుత్వంలో ప్రతి పథకం నేరుగా లబ్ధిదారులకు సమయానికి చేరేదని, ఎన్నికల్లో గెలిచేందుకు ఎన్నో మాయమాటలు చెప్పిన కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోపై దృష్టి పెట్టడం లేదని ఎద్దేవా చేశారు. ఉచిత ఇసుక మూడు నాళ్ల ముచ్చట గానే సాగిందన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి-2 కర్రీ శ్రీను, మాజీ ఎంపిపి గొరపెల్లి జయప్రకాష్, వైసిపి మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, బొంతల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కరాటే అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - కొత్తవలస

జిల్లాలో కరాటే అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం అయింది. విజయనగరం మహిర షాటోకాన్ కరాటే డోజోలో కరాటే సమావేశం సోమవారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి, కరాటే మాస్టర్స్ పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో టెక్నికల్ డైరెక్టర్‌గా కెఎ రాజు, ప్రెసిడెంట్‌గా ఎ. లక్ష్మణరావు (కొత్తవలస), జనరల్ సెక్రటరీగా బి.వి. అప్పారావు (కొత్తవలస), ట్రజరర్ పి. సాగర్ (గుమ్మలక్ష్మి పురం), వైస్ ప్రెసిడెంట్ జి. గోపాల కృష్ణ (పార్వతీపురం), వైస్ ప్రెసిడెంట్ బి.తాతారావు. (విజయనగరం), జాయింట్ సెక్రటరీల-1 కె.సంతోష్ కుమార్, జాయింట్ సెక్రటరీ- 2 వి.శ్రీనివాస్ రావు (శృంగవరపుకోట) ఎడ్యూక్యూట్ మెంబర్-1 యస్. ప్రభాకరావు (పార్వతీపురం), ఎడ్యూక్యూట్ మెంబర్ -2 ఆర్. శివ (రాజాం)ఎన్నికయ్యారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డిఐజి తనిఖీలు

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం సబ్ రిజిస్ట్రారు కార్యాలయాన్ని విజయనగరం డిఐజి పి. విజయలక్ష్మి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయంలోని రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. కార్యాలయంలో ఉన్న రికార్డు గదులను పర్యవేక్షించి రికార్డులు పొందుపరచడంలో సబ్ రిజిస్టర్ రోషన్ కుమార్‌తో పాటు సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఇప్పటివరకు సాధించిన లక్ష్యాలను సబ్ రిజిస్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.

బీడు భూముల్లో సామాజిక అడవులు పెంచండి

శృంగవరపుకోట: బీడు భూముల్లో సామాజిక అడవులను పెంచాలని అటవీ శాఖ అధికారి దాసరి సత్యం పిలుపునిచ్చారు.మొహంతి కౌముది గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ పై సోమవారం అవగాహనా సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూమి వ్యాపారాలు కారణంగా పూర్వీకులు శ్రమించి సాగులోకి తీసుకువచ్చిన భూములన్నీ బీడు భూములుగా మిగిలి పోతున్నాయని, వ్యవసాయానికి ఉపయోగపడక, నిర్మాణాలు చేపట్టక వృథాగా ఉంటున్నాయన్నారు. నిర్మాణాలు చేపట్టే వరకైనా బీడు భూముల్లో సామాజిక అడవులు పెంచాలన్నారు. అనంతరం పాఠశాల నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ, దేవీకూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జియో వ్యవస్థాపకులు బొబ్బిలి రామకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ శాంతి మహంతి, డి.టి.ఒ. కె.భరత్ కుమార్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

31న పిడిఎస్ బియ్యం వేలం

రేగిడి: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఈనెల 31 ఉదయం 10 గంటలకు పిడిఎస్ బియ్యం వేలం పాట వేయనున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ సోమవారం తెలిపారు. 15 క్వింటాలు పిడిఎస్ బియ్యం ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే వేలంపాట వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు బియ్యం వేలం పాటలో పాల్గొన వచ్చు నన్నారు. పూర్తి సమాచారం కోసం రేగిడి తహశీల్దార్ కార్యాలయానికి ఆధార్ కార్డుతో రావాలని కోరారు.

3న మండల సమావేశం

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆగస్టు 3 ఉదయం 10 గంటలకు ఎంపిపి ధార అప్పలనరసమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శ్యామల కుమారి సోమవారం తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి ప్రజాప్రతినిధులు, ఎంపిటిసిలు, సర్పంచులు హాజరు కావాలన్నారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు పూర్తి సమాచారంతో అధికారులు సమావేశానికి హాజరు కావాలన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఆలమూరు

O.S. No. 115/2021

Between:
Tadi Veerreddy, S/o. Chinna Venkata Reddy, Hindu, R/o. D.No. 3-23/1, Gram Panchayat Street, Jonnada Village, Alamuru Mandal.
...Plaintiff

AND

Goluguri Maheswar Reddy, S/o. Jaggireddy, Hindu, R/o. Flat No. 25P, 26P, Gruhapriya Residency, Backside of Petrol Bunk, Venkampeta, Parvathipuram, Vizianagaram District.
...Defendant

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 09-8-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జి.శ్రీనివాసరెడ్డి
ఆలమూరు అడ్వకేట్, రాజమండ్రి
29-7-2024 సెల్: 9299752439